సాక్షి శ్రీకాకుళం

బుధవారం ◆ 1 ◆ అక్టోబర్ ◆ 2025

I



ప్రైవేటీకరణ తగదు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని అన్ని వర్గాల వారు అన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు.

- IIలో



పెరుగుతున్న చైతన్యం

రక్తదానంపై చైతన్యం పెరుగుతోంది. నేడు జాతీయ రక్తదాతల దినోత్సవం.

- IIలో

పోస్టు చేసినా కేసేనా..?

పలాస: సోషల్ మీడియాలో సాధారణ పోస్టులు పెడుతున్నా సరే అధికార పార్టీ నాయకులు కేసులు పెట్టి వేధించడానికి పూనుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిస్టు గోపిపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఆయన పత్రికల్లో వచ్చిన కథనాలను జోడిస్తూ మాత్రమే పోస్టు చేశారు. కానీ టీడీపీ నాయకులు మాత్రం కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణకు మంగళవారం దీనిపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయనను వివరణ కోరగా టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేశారని, విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచే కిరణ దర్శనం

- ఆదిత్యాలయంలో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు
- రేపు కూడా దర్శనానికి చర్యలు

అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలోని సూర్యభగవానుడిపై తొలి సూర్యకిరణాలు స్పృశించే అద్భుతానికి సమయం ఆసన్నమైంది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏటా ఉత్తరాయణ దక్షిణాయణ కాలమార్పుల్లో సంభవించే ఈ అద్భుతాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు వందలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు. ఈ మేరకు బుధవారం వేకువజాము సూర్యోదయ కాలాన తొలి సూర్యకిరణాలు ఆలయ రాజగోపుర ప్రాకారం నుంచి అనివెట్టి మండపం గుండా నేరుగా గర్భాలయంలోని స్వామి మూలవిరాట్టును తాకనున్నాయి. ఈ అద్భుతాన్ని చూసేందుకు మంగళవారం సాయంత్రానికే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు అరసవల్లి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ మేరకు భక్తులకు కిరణదర్శనానికి ప్రత్యేకంగా ధ్వజస్తంభం నుంచి బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. సూర్యోదయ సమయాన వాతావరణం అనుకూలిస్తే కచ్చితంగా బుధ, గురువారాల్లో సూర్యకిరణాల కాంతులు స్వామి మూలవిరాట్టుపై దర్శనమిస్తాయని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వివరించారు.

విద్యార్థి విజ్ఞాన్ మంతన్ రిజిస్ట్రేషన్స్ గడువు పొడిగింపు

శ్రీకాకుళం: కేంద్ర ప్రభుత్వం సంస్థలు ఎన్సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ సైన్స్ మ్యూజియం, భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా లార్జెస్ట్ ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్యార్థి విజ్ఞాన్ మంతన్ 25–26, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే కార్యక్రమం అక్టోబర్ 10 వరకు పొడిగించినట్లు వీవీఎం జిల్లా కోఆర్డినేటర్ ఎ.పున్నయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ రాష్ట్రాల పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు ప్రకృతి వైపరీత్యాలు, అర్ధ సంవత్సర పరీక్షలు, పండగలు దృష్ట్యా పొడిగించామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మాక్ టెస్ట్ అక్టోబర్ 15 వరకు ఉంటుందని తెలియజేశారు.

దుర్గా దేవిగా నీలమణిదుర్గమ్మ



పాతపట్నం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు దుర్గా దేవిగా పూజలు అందుకున్నారు. అమ్మవారి ఆవరణలోని యోగశాలలో దేవతా హోమాలు, అమ్మవారి మూల మంత్ర హోమాలను నిర్వహించారు.



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదలపై ఎందుకంత కక్ష..?

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేయాలి
- జీఓ నంబర్ 590ని తక్షణమే రద్దుచేయాలి
- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ధర్నా

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

వైద్య విద్యను ధనవంతులకు మాత్రమే పరిమితం చేయాలనే చంద్రబాబు ఆలోచన సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు మండిపడ్డారు. అసలు చంద్రబాబుకు పేదలపై ఎందుకంత కక్ష అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపు మేరకు, అదే విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సూచనల మేరకు కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ మైనార్టీసెల్ ఎంఏ బేగ్, లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీపతి, ఎంఏ రఫీ, గార మండల పరిషత్ అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురాం, పార్టీ శ్రీకాకుళం రూరల్‌మండల అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, మూకళ్ల తాతబాబు, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రొతు శంకరరావు, వైవీ శ్రీధర్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు భరద్వాజ్, బొచ్చన రాజేష్, ఎండ రమేష్, వానపల్లి రమేష్, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, కార్యదర్శి పెయ్యిల లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సతివాడ రామినాయుడు, జడ్యాడ జయరావు, ప్రధాన కార్యదర్శి నీలాపు ముకుందరావు, కార్యదర్శులు బెలమర జీవన్‌రావు, శ్రీనివాసరావు, రావాడ వెంకటరావు, అధికార ప్రతినిధి గుజ్జల యోగేశ్వరరావు, శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షుడు యజ్జల గురుమూర్తి, టెక్కలి నియోజకవర్గ అధ్యక్షులు కర్జిక జీవన్‌రావు నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆట్ల రాహుల్‌కుమార్, జలగడుగుల శ్రీనివాసరావు, కల్లేపల్లి రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు వంత పాడుతారా..?



వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్పొరేట్లకు వంత పాడడమే చంద్రబాబు పాలనా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి విద్య మాత్రమే సాధనమన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. ఇదే విషయాన్ని అంబేడ్కర్ ఏనాడో చెప్పారని, ఈ ధోరణి విడనాడకుంటే చంద్రబాబు దళితుల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు.

ఆగ్రహం తప్పదు..



పార్టీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వమే బాధ్యత తీసుకొని మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపడితే బోధనాస్పత్రుల్లో నాణ్యమైన వైద్య, విద్య మెరుగ్గా అందుతుందన్నారు. తద్వారా మెరుగైన ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. బీజేపీ, జనసేనలు పీపీపీ విధానాన్ని వ్యతిరేకించి పేద ప్రజలకు వైద్య విద్యను సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోకుంటే పేద ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

విద్యను వ్యాపారం చేస్తారా..?



పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు జీఓ నంబర్ 590 విడుదల చేయడం చంద్రబాబు నాయుడికి తగదని అన్నారు. విద్యను వ్యాపారం చేసి డబ్బు సంపాదించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానం అమలు చేస్తే అంతా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అయితే పేద పిల్లలకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మెడికల్ విద్యను ప్రైవేటు పరం చేయాలని చూడడం దారుణమన్నారు.

కాంట్రాక్టర్ల గుండె గు‘బిల్లు’

- కాంట్రాక్టర్ల ఈఎండీలు ఇచ్చేదెప్పుడో..?
- రూ.4 కోట్ల మేర పెండింగ్
- గగ్గోలు పెడుతున్న 40 మంది కాంట్రాక్టర్లు
- అధికార పార్టీ అండదండలు ఉంటేనే బిల్లుల చెల్లింపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్పొరేషన్ పరిధిలో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఏళ్ల తరబడి ఎర్నెడ్ మనీ డిపాజిట్లు(ఈఎండీ) చెల్లించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్లను కలిశామని, వారు హామీ ఇచ్చినా నేటికీ పని జరగలేదని అంటున్నారు. ఈ ఏడాది జూన్‌లో మూడుసార్లు, జూలైలో ఒక్కసారి ఎమ్మెల్యే, కలెక్టర్లతో కాంట్రాక్టర్లకు మీటింగ్‌లు జరిగాయి. అయినా ఫలితం మాత్రం లేదు. ఈఎండీలు అంటే కాంట్రాక్టర్లు ఏదైనా పనులకు టెండర్లు వేసి పనులు దక్కించుకున్నప్పుడు ముందస్తుగా డిపాజిట్ కింద 2.5 శాతం డబ్బుల్ని చెక్ రూపంలో చెల్లించాలి. పనులు పూర్తయిన తర్వాత నాణ్యతప్రమాణాలు లోపించడం గానీ, పనులు పాడవ్వడం వంటివి జరిగితే డిపాజిట్‌గా కట్టిన డబ్బుల్లో దానికి ఖర్చు చేస్తారు. అలాంటి పరిస్థితులు కార్పొరేషన్ పరిధిలో ఒక్కటి కూడా లేవు. కానీ డబ్బులు మాత్రం చెల్లించడం లేదు.

నిర్లక్ష్యమే కొంప ముంచింది

ఇంజినీరింగ్ సెక్షన్‌లో పదేళ్ల పాటు ఈ–1గా విధులు నిర్వహించిన ఓ వ్యక్తి నిర్లక్ష్యం వల్లే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. డిపాజిట్ కింద ఇచ్చిన చెక్కులు, పనుల వివరాలు రికార్డు చేసిన ఎం–బుక్‌లు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ఏళ్ల తరబడి తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాత వ్యక్తి వెళ్లి కొత్త ఈ–1 వచ్చినా సమస్యను పరిష్కరించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎండీల కోసం తిరిగి తిరిగి రాకపోవడంతో ఇమ్మంది మల్లేసు, కంచరాన బాబురావు అనే కాంట్రాక్టర్లు టెన్షన్ తట్టుకోలేక గుండెపోటుతో మరణించారు.



కార్పొరేషన్ కార్యాలయం

చేసిన పనుల సంగతేంటి..?

ఈఎండీ బిల్లుల సంగతి అటుంచితే కూటమి వచ్చాక చేసిన పనులకైనా బిల్లులు ఇవ్వడం లేదు. నిధి పోర్టల్‌ని అప్‌డేట్ చేస్తున్నామని కూటమి అధికారంలోకి వచ్చాక నెలల తరబడి తాత్సారం చేశారు. ఇప్పుడు ఈ పోర్టల్ పనిచేస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వడం లేదు. పక్కన విజయనగరంలో పనిచేస్తున్న నిధి పోర్టల్ శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఎందుకు పనిచేయడం లేదో తెలియని పరి స్థితి ఉంది. కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం దాదాపు 25 మంది కాంట్రాక్టర్లకు సంబంధించి 25 ఫైళ్లకు గాను రూ.8 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

ఆ నలుగురికే బిల్లులు..

కార్పొరేషన్ పరిధిలో పనులు ఎంతమంది పనులు చేసినా బిల్లులు మాత్రం ఆ నలుగురికే వస్తున్నాయి. సీ–బిల్లు పేరుతో కమిషనర్ కూటమి నాయకుల సిఫార్సులు ఉన్నవారికి బిల్లులు ఇస్తున్నారు. యోగాంధ్ర వంటి కార్యక్రమాలతో పాటు అనేక కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వెంటవెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. అలాంటిది శాశ్వత ప్రాతిపదికన ప్రజలకు ఉపయోగకరమైన రోడ్లు, కాలువలు, భవన నిర్మాణాలకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ స్పందించకపోతే నిరసనలు ఉద్ధృతం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న పీహెచ్‌సీ వైద్యులు

- డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేసిన పీహెచ్‌సీ వైద్యులు
- పూర్తి స్థాయి విధులకు దూరంగా ప్రభుత్వ గ్రామీణ వైద్యులు

అరసవల్లి: జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు సర్కారుపై ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఎదుట వైద్యులంతా కలిసి ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలతో జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ప్రభుత్వ వైద్యం రోగులకు దూరమైంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు డాక్టర్ సుధీర్, ప్రతిష్టాశర్మ, సుమప్రియ, పావని తదితరుల ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 72 పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న సుమారు 125 మంది వైద్యులు మంగళవారం ఉదయం నుంచి జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. సోమవారం వరకు అవుట్ పేషెంట్ (ఓపీ) రోగులకు వైద్య సేవలను నిలిపివేసి, కేవలం ఎమర్జెన్సీ వైద్య సేవలను మాత్రమే అందించిన వైద్యులు.. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో అన్ని రకాల వైద్య సేవలను బంద్ చేశారు. ముందస్తుగా ఇచ్చిన సమ్మె నోటీసు ప్రాప్తికి తమ నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని సర్కార్‌కు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు..

వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్ విదేశీ పర్యటనను సాకుగా చూపుతూ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామీణ వైద్యులు ఆరోపిస్తున్నారు. మరో ఐఏఎస్ అధికారి కృష్ణబాబుకు తాత్కాలిక బాధ్యతలను అప్పగించినా ఇలాంటి పరిపాలన అంశాలపై కీలక నిర్ణయాలపై ఆదేశాలు ఇవ్వలేరని చెబుతున్నారు.

‘మరో థర్మల్ కేంద్రం మాకొద్దు’



శ్రీకాకుళం: జిల్లాలో గత కొన్నేళ్లుగా కాలుష్యకారకమైన థర్మల్ విద్యుత్ కేంద్రాలు ప్రతిపాదించడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చౌదరి లక్ష్మణ రావు అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని గిరిజన గ్రామం వెన్నెలవలస వద్ద 3200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం, ఆమదాలవలసల్లో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రంతో ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను తక్షణం నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశా రు. కరపత్రాల ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రం వల్ల ప్రకృతికి, మానవాళికి జరిగే అనర్థాలను వివరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో థర్మల్ విద్యుత్ కేంద్రాల ఊసే లేదన్నారు. పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు.

ఇప్పుడెలా..?



- గాంధీ జయంతి రోజునే విజయదశమి
- మాంసం విక్రయాలు వద్దంటూ నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

అరసవల్లి: దసరా అంటే నవరాత్రుల సంబరాలే కాదు.. ఇంటిల్లిపాదీ విందు భోజనాలు కూడా. కానీ ఈ ఏడాది సరిగ్గా మహాత్మా గాంధీ జయంతి నాడే దసరా పడింది. మహాత్ముని జయంతి నాడు మద్యం, మాంసం విక్రయించడం చాలా కాలంగా దేశంలో లేదు. ఈ ఏడాది కూడా అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానాలు విధించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో మాంసం విక్రయదారులు ఆందోళనలో ఉన్నారు. మహాత్ముని జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే రోజు ‘శాకాహార దినం’గా కూడా పాటిస్తున్నారు. దీనిపై శ్రీకాకుళం మున్సిపల్ హెల్త్ ఆఫీస ర్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా కచ్చితంగా మాంసాహార విక్రయాలపై దాడులు చేస్తామని చెప్పారు. గత ఏడాది కూడా చాలా వరకు దుకాణాల నుంచి అపరాధ రుసుములను వసూలు చేశామని, ఈసారి కూడా మాంసం విక్రయ దుకాణ దారులందరికీ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే రూ.5 నుంచి రూ.15 వేల వరకు ఫైన్ కట్టించుకుంటామన్నారు.

● ఏమనీ చెప్పేది..?



చిత్రం చూసి ఇదేదో ఆలయంలోని హుండీ అనుకునేరు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని ఫిర్యాదుల పెట్టె ఇది. ఆస్పత్రిలో సేవలపై అసంతృప్తి ఉంటే ఇందులో ఫిర్యాదులు రాసి వేయవచ్చు. కానీ ఆస్పత్రికి వస్తున్న కొందరు ఈ డబ్బాను హుండీగా భావించి డబ్బులు వేయడం విస్తు గొలుపుతోంది. జనం అమాయకత్వం ఈ స్థాయిలో ఉండడంపై ఆస్పత్రి వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి.

– టెక్కలి రూరల్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- తక్షణమే ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- అన్ని పార్టీలు, సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు



దళిత ఆదివాసీ బహుజన మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

శ్రీకాకుళం : వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని దళిత ఆదివాసీ బహుజన మైనార్టీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి సర్కారు తన నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు ఐక్యంగా పోరాటం సాగించి అణగారిన, బహుజన వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఉద్యమాల పురిటిగడ్డ శ్రీకాకుళం నుంచే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మొదలుపెడతామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ దళిత ఆదివాసీ బహుజన మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. జేఏసీ నేత తైక్వాండో శ్రీను పర్యవేక్షణలో డాక్టర్ కంఠ వేణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా అంబేద్కర్ చిత్రపటాని నివాళులర్పించారు. పాటల తూట ఆతవ ఉదయభాస్కర్ తొలుత ఏమై పోదుమో అంబేద్కర్ లేకుంటే అన్న పాటను పాడి సమావేశాన్ని ప్రారంభించారు.

– రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అణగారిన, బహుజన, మైనార్టీవర్గాలను వైద్య విద్యకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ పాల్గొనాలని కోరారు. పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు మెడికల్ కాలేజీలను కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడటం దుర్మార్గమని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. సీఎం చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తారని ధ్వజమెత్తారు. కార్పొరేట్లకు, సొంత సామాజికవర్గం వారికి మేలు చేయడంపైనే ఆయన దృష్టి పెడతారని ఆరోపించారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వాలు మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం అవసరమైన నిధులు ఖర్చు చేయలేరా? అని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రశ్నించే వారు కరువవుతుండడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమన్నారు. గతంలో పాలకులు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాజకీయా పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళనలు చేపట్టే వారని గత కొంత కాలంగా ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశం వేదికగా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చణీయాంశమై మరో పోరుకు నాందికావాలని ఆకాంక్షించారు. రౌండ్ సమావేశంలో తీర్మానించిన అంశాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని నేతలు స్పష్టం చేశారు.

- తైక్వాండో శ్రీను, కంఠ వేణులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై జేఏసీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దసరా పండుగ తర్వాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.
- రౌండ్ టేబుల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, కళింగ కోమటి సామాజికవర్గ నాయకులు అంధవరపు సూరిబాబు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, దళిత ఆదివాసీ నాయకులు వాబ యోగి, గ్లోబల్ స్కూల్స్ అధినేత ప్రసాదరావు, హ్యూమన్ రైట్ కమిషన్ నాయకులు ఇంజనీర్ మునిశ్రీనివాస్, ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు ముజీమ్, ఎస్సీ ఎస్టీ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాడాన దేవభూషణరావు, రెల్లి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, లయన్ కరణం హారికా ప్రసాద్, లయన్ పొన్నాడ రవికుమార్, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సవలాపురపు వెంకటరమణ మాదిగ, రచయిత దుప్పల రవికుమార్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు ఎంఏ.రఫీ, ఎస్సీ సెల్ నాయకుడు పొన్నాడ రుషి, కాళింగ సామాజికవర్గ ప్రతినిధి బగాది వెంకటరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, స్వచ్ఛంద సేవకులు నటుకులు మోహన్, ఇంజినీర్ దుంగ సుధాకర్, నాయకులు తంగుడు నాగేశ్వరరావు, కళింగ కోమటి సామాజికవర్గ ప్రతినిధి కోణార్క్ శ్రీను, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు టి.కామేశ్వరి, నాయకులు మండవిల్లి రవి తదితరులు ప్రసంగించారు.

రాజకీయాలకు అతీతంగా పోరాటం



ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అంశంపై రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి. మా అధినాయకత్వానికి పునరాలోచన చేయమని కోరుతాం.

– సవలాపురపు వెంకటరమణ మాదిగ, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు

అభివృద్ధి పేరిట విధ్వంసం



అభివృద్ధి ముసుగులో విధ్వంసం చేయడం కూటమి నాయకులకు పరిపాటి అయింది. ఇటువంటి ప్రజావ్యతిరేక పేదల వ్యతిరేక నిర్ణయాలపై సమష్టిగా పోరాడాలి.

– దుప్పల రవికుమార్, రచయిత

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. చంద్రబాబు తనవారికి లబ్ధి చేకూర్చాలన్నదే కానీ పేదల కోసం ఏ అంశంలోనూ ఆలోచన చేయరు.

– ఎంఏ రఫీ , వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకుడు

నిర్ణయం సరికాదు..



వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వైద్య విద్యను ప్రైవేటీకరించాలని యోచించడం తగదు. ఈ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలి.

– జోగినాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు

ఉద్యమమే



వైద్య విద్యకు పేద విద్యార్థులను దూరం చేయాలని చూస్తే ఉద్యమమే. దీనిపై పునరాలోచన చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చేలా పోరాడుతాం.

– పొన్నాడ రుషి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు

కలను కాలరాయడమే..



వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం అంటే పేద విద్యార్థి కలను కాలరాయడమే. ఇటువంటి ఆలోచనలు ఎందుకొస్తున్నాయో తెలియడం లేదు.

– పట్నాల శ్రీనివాస్, వస్త్ర వ్యాపారుల సంఘ నేత

ప్రజావ్యతిరేక నిర్ణయం



చంద్రబాబు చేపట్టే విధానాలన్నీ పేదల వ్యతిరేక విధానాలే. కార్పొరేట్లకు, తన వారికి లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.

– ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ యువనేత

రాజ్యాంగ విరుద్ధం



కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం. దేశంలో ఎక్కడా ఇటువంటి విధానం లేదు.

– అంధవరపు సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు

ఇదేనా గౌరవం..



రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని వ్యక్తి ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు. ఆయన సొంతంగా రాసుకున్న రాజ్యాంగం దాని ప్రకారమే పాలన సాగిస్తుంటారు.

– కల్లేపల్లి రామ్‌గోపాల్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

తీరంలో మృతదేహం

సంతబొమ్మాళి: పిట్టవానిపేట సముద్రతీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం సాయంత్రం కొట్టుకొచ్చింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఒకటి రెండు రోజుల కిందట సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతై ఉంటారని స్థానిక మత్స్యకారులు భావిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల : తోటపాలెం పంచాయతీ అఖింఖాన్‌పేట శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5 వేలు నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్‌కుమార్ తెలిపారు.

ఘనంగా కొత్తమ్మ తల్లి మారువారం



పూజలందుకుంటున్న అమ్మవారు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయంలో మంగళవారం మారువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులంతా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముగ్రాటలతో చల్లదనం చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.51 కోట్లు భారం



టెక్కలి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మనందరెడ్డి, ఇతర అధికారులు

టెక్కలి: ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా కొనసాగుతోందని, ఈ పథకం ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం జిల్లాల్లో నెలకు సుమారుగా రూ.51 కోట్లు భారం పడుతోందని ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 6 జిల్లాల్లో 1610 బస్సులు ఉన్నాయని వాటిలో స్త్రీ శక్తి పథకానికి 1352 బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. కొత్తగా బస్సులు పెంచే ఆలోచన ప్రభుత్వ విధానం పై ఆధారపడి ఉంటుందని ఈడీ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో ఒక సారి రద్దయిన బస్సులను మళ్లీ పునరుద్ధరణ చేయడం కష్టతరమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లను బీఓటీ పద్ధతి ద్వారా ఆధునీకరణ చేయడానికి చర్యలు చేపడుతున్నామని ఈడీ పేర్కొన్నారు. ఐటీఐలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ఫిట్టర్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఈడీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 154 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రమాదంలో మరణిస్తే రూ.1.10 కోట్ల పరిహారం అందజేస్తామని, సాధారణంగా మరణిస్తే రూ.10 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. ఆయనతో పాటు డీపీటీఓ సీహెచ్ అప్పలనారాయణ, డీఈ రవికుమార్, డీఎం ఎం.శ్రీనివాస్ ఉన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా



కరపత్రం విడుదల చేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

శ్రీకాకుళం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు కె.భానుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళం ఎన్‌జీఓ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామమూర్తి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, మెరుగైన పీఆర్‌సీ, మధ్యంతర భృతి మంజూరు, మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ వంటి హామీలు కాలేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు ఏటా రూ.180 కోట్లు హెల్త్‌కార్డుల కోసం చెల్లిస్తున్నా ఆస్పత్రులు అంగీకరించడం లేదన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.రమణ బి.వెంకటేశ్వర్లు వి.సత్యనారాయణ, కుప్పిలి జగన్మోహన్, చావలి శ్రీనివాస్, వి.నవీన్‌కుమార్, వి.రామారావు, పి.హరిప్రసన్న, టి.శ్రీనివాసరావు, డి.రామ్మోహన్ డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో సిక్కోలు హవా

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా క్రీడాకారులు రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడామైదానం వేదికగా ఈ నెల 27 నుంచి 29 వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో జిల్లా నుంచి 82 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా 43 పతకాలు సాధించారు. వీటిలో 17 బంగారు, 14 రజత, 12 కాంస్య పతకాలు ఉన్నాయి. టోర్నీ ముగించుకుని జిల్లాకు చేరుకున్న క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు), రాష్ట్ర ఉపాధ్యక్షులు నౌపడ విజయ్‌కుమార్, రాష్ట్ర/జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, జిల్లా కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, కె.మాధవరావు, బి.వి.రమణ, హరిబాబు, తవిటయ్య, శ్రీనివాసరావు, పీడీ, పీఈటీలు తదితరులు అభినందించారు. జిల్లా బృందానికి కోచ్ మేనేజర్లగా వ్యవహరించి మెప్పించిన ఈ.అప్పన్న, రామయ్యల సేవలను ప్రశంసించారు. వివిధ అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో ఎం.శృతి, బి.కుసుమ, బి.వెంకటలక్ష్మి, ఎల్.కల్పన, మౌనికా మిశ్రా, డి.భాను, బి.హారిక, పి.సిద్ధార్ధ, టి.తరుణ్, పి.హేమంత్, బి.కౌజి, వి.రాజేష్, బి.మోకేష్, భరత్‌చంద్ర, బి.కృష్ణ, మదన్‌యాదవ్, ఎం.కృపాసింగ్, బి.కార్తిక్ తదితరులు పతకాలు సాధించారు.

నదిలో మహిళ గల్లంతు

హిరమండలం: కొమనాపల్లి పంచాయతీ పాత కొమనాపల్లి గ్రామానికి చెందిన రావాడ జయమ్మ(53) వంశధార నదిలో మంగళవారం గల్లంతయ్యాఇంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జయమ్మకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. రెండు సార్లు ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి వంశధార నదికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా నదిఒడ్డున జయమ్మ వాడిన కర్ర కనిపించింది. దీంతో నదిలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



ఘటనా స్థలంలో యశ్వంత్ కుమార్ మృతదేహం



లక్ష్మణరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జి.సిగడాం: జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. జి.సిగడాం మండలం ఆనందపురం –వాం్రంగి గ్రామాల మధ్య వంతెన సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం ఇల్లయ్యగారిపేట గ్రామానికి చెందిన కొంచాడ యశ్వంత్‌కుమార్(15), గారపేటకు చెందిన కెల్ల వెంకటేష్ బైక్‌పై దవళపేటలోని స్నేహితుడి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి లగేజ్ వ్యాన్ ఢీకొనడంతో యశ్వంత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్‌కు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళం తరలించారు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని..

మెళియాపుట్టి : బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ పరిసరాల్లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. చాపర గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నాగవంశపు లక్ష్మణరావు(39) నడిచి వెళ్తుండగా ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మణరావుకు భార్య కల్పన, ముగ్గు రు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..



సూర్యనారాయణ మృతదేహం

శ్రీకాకుళం రూరల్: పెదపాడు ప్రధాన రహదారిలో పద్మావతి కల్యాణ మండపం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. బొట్ట సూర్యనారాయణ (75) స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో నైట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధుల్లో చేరేందుకు రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పెదపాడు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సూర్యనారాయణ భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛంద రక్తదానం..
పెరుగుతున్న చైతన్యం

- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న దాతలు
- ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలుస్తున్న వైనం
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం

రక్తదానం చేయాలనుకుంటే..

బ్లడ్ బ్యాంక్	ఫోన్ నంబర్
శ్రీకాకుళం రెడ్‌క్రాస్	9133008585
న్యూ బ్లడ్ బ్యాంక్(శ్రీకాకుళం)	9550501503
లయన్స్ బ్లడ్ బ్యాంక్(శ్రీకాకుళం)	7995636077
జెమ్స్ బ్లడ్‌బ్యాంక్(రాగోలు)	9247311030
ప్రాణదాత బ్లడ్‌బ్యాంక్(పలాస)	8567892777
ఉద్దానం బ్లడ్ బ్యాంక్(సోంపేట)	7606999399



రక్తదానం చేస్తున్న దృశ్యం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్ :

రక్తదానంపై చైతన్యం పెరుగుతోంది. అపోహలు, వివిధ కారణాల వల్ల ఒకప్పుడు శిబిరాలు ఏర్పాటు చేసి బతిమాలితే గానీ రక్తదానానికి ఎవరూ వచ్చేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. స్వచ్ఛందంగా బ్లడ్‌బ్యాంకులు, శిబిరాలకు వెళ్లి రక్తదానం చేసేవారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. ఫలితంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమందికి పునర్జన్మ లభిస్తోంది. భారత ప్రభుత్వం ఏటా అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం (నేషనల్ వలంటరీ బ్లడ్ డోనర్స్ డే) నిర్వహిస్తోంది.


రక్త నిల్వ కేంద్రాలు..

రక్తాన్ని సేకరించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా బ్లడ్ బ్యాంకు(రక్త నిల్వ కేంద్రాలు)లు అందుబాటులో ఉన్నాయి. ఏర్పాటు చేశారు. సేకరించిన ఇక్కడ నిల్వచేసి అవసరమైన వారికి అందిస్తుంటారు. జిల్లాలో అతి పెద్ద రక్తనిల్వ కేంద్రంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ నిలుస్తోంది. ఇక్కడి నుంచి జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు, పాతపట్నం, టెక్కలి, పాలకొండల ప్రభుత్వ ఆసుపత్రులకు రక్తాన్ని అందిస్తున్నారు. తలసేమియా, సికిల్‌సేమియా, హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పాటు ప్లేట్‌లెట్స్, ఎఫ్ఎఫ్‌పీ కూడా సేకరించి అందిస్తున్నారు. ఎస్‌డీపీ ద్వారా కూడా రక్తసేకరణ చేస్తున్నారు.

అపోహలు వీడాలి..

చాలా మందికి రక్తదానం అంటే భయం, అపోహలు ఉన్నాయి. రక్తదాన ప్రక్రియలో కేవలం 300 మి.లీ. రక్తం మాత్రమే స్వీకరిస్తారు. సాధారణంగా మనిషిలో సరాసరి 5 లీటర్ల నుంచి 6 లీటర్ల రక్తం ఉంటుంది. అందులో 300 మి.లీ.రక్తం దానం చేయడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగదు. 18 నుంచి 60 ఏళ్ల కలిగిన ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు. బీపీ, షుగర్ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు రక్తదానానికి దూరంగా ఉండటం మంచిది. జిల్లా జనాభాతో పోల్చితే రక్తదాతలు కేవలం ఒక్క శాతం మాత్రమే. అవసరం మాత్రం అంతకుమించి ఉంది. జిల్లా అవసరాలకు సరిపడా రక్తం సేకరణ జరగడంలేదనే చెప్పాలి.


మూడు నెలలకోసారి..



నేను స్టేట్ బ్యాంకులో పనిచేశాను. సామాజిక బాధ్యతగా ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేస్తుంటాను. మొదట్లో రక్తదానం అంటే భయం వేసేది.అప్పట్లో నాకన్నా వయస్సులో పెద్ద అయిన మా మేనేజర్‌ను చూసి స్ఫూర్తి పొందాను. ఇప్పటివరకు 65 సార్లు రక్తదానం చేశాను.

– సీహెచ్.రమణమూర్తి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, శ్రీకాకుళం

20 సార్లు రక్తదానం చేశాను..



ఇప్పటివరకు 20 సార్లు రక్తదానం చేశాను. రక్తం చేయడం బాధ్యతగా భావిస్తా. నాలుగు నెలలకు ఒకసారి రక్తం ఇస్తుంటాను. స్కూల్ వార్షికోత్సవ సమయంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తుంటాం. యువకులు రక్తదానం చేసేందుకు ముందుకురావాలి.

– పి.శ్రీకాంత్, ఎన్‌సీఎస్ డైరెక్టర్, శ్రీకాకుళం

లక్ష యూనిట్ల సేకరణ లక్ష్యం



లక్ష యూనిట్ల సేకరణ లక్ష్యంగా పనిచేస్తున్నాం. నేను కూడా 32 సార్లు రక్తదానం చేశాను. మరొకరి ప్రాణాలు కాపాడంలో ఆనందం ఉంటుంది. రక్తదానంపై గ్రామీణ ప్రాంతాలలో యువతలో ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

– పి.చైతన్య కుమార్, జిల్లా రెడ్‌క్రాస్ మోటివేటర్

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

సోంపేట : కొర్లాం జాతీయ రహదారి వద్ద సెప్టెంబరు 14న చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని బారువ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సోంపేట సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.మంగరాజు, బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు విలేకరులకు వివరాలు వెల్లడించారు. కవిటి మండలం దూగానపుట్టుగకు చెందిన దంపతులు ఎంపలి కృష్ణ, జానకి మందస మండలంలో తన అల్లుడి వద్దకు దసరా పిలుపుకు బయలుదేరారు. కొర్లాం జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వీరిని కలిసి శ్రీకాకుళం వెళ్లేందుకు దారి చూపించమని అడిగారు. దీంతో కృష్ణ బైక్‌ను నెమ్మది చేశారు. ఈ సమయంలో కృష్ణ భార్య ధరించిన 42 గ్రాముల బంగారు చైన్ తెంచుకుని పలాస వైపు పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తులుగా అనుమానించారు. కేసు దర్యాప్తు చేస్తుండగా మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ ధరించి బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసులు వెంబడించి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మురళి శెట్టి, రంజన్ సాహులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా కొర్లాంలో జరిగిన చైన్‌స్నాచింగ్‌ను ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి 43 గ్రాముల బంగారు గొలుసు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సోంపేట సీఐ, బారువ ఎస్‌ఐలకు ఎస్పీ అభినందించారు.